# ఆ నవ్వే కొంపతి

-పొట్లూరి సుబ్రహ్మణ్యం



ఆనందరావు, నిర్మలలది ఆదర్శ దాంపత్యం.

అయితే, ఆ ఆదర్శ దాంపత్యంలో ఓ చిన్న అపశృతి. వాళ్ళకు సంతానం లేదు. అయినంత మాత్రాన వాళ్ళ మధ్య ప్రేమ తగ్గలేదు. పైపెచ్చు ఆ అసంతృప్తి వాళ్ళనింకా గాఢమయిన ప్రేమికులుగా చేసింది. డాక్టరు దగ్గరకు పోతే ఎవరిదో ఒకరి లోపం బయటపడి, ఆ సదరు వ్యక్తి బాధపడతారని అసలు డాక్టరు దగ్గరకు పోవాలన్న ఆలోచనే ఎవరికి వాళ్ళు మానుకున్నారు. వాళ్ళ ప్రేమ అంత పవిత్రమైంది. అయితే పిల్లలు కావాలన్న వాళ్ళ కోరిక మాత్రం అణగారిపోలేదు.

ఆరోజు ఉదయం ఆనందరావు మామూలుగా ఆఫీసుకు బయలుదేరి రోడ్డుమీదికి వచ్చాడు. అదే సమయంలో ఎదురింటి రామారావు కూడా రోడ్డు మీదికి వచ్చాడు. అతని ప్రక్కన ఓ పదేళ్ళ అమ్మాయి ఉంది. గుండ్రని ముఖం, పెద్ద పెద్ద కళ్ళు, ముఖం మీద చెరగని చిరునవ్వు, తెల్లగా అందంగా, బొద్దుగా ఉందా అమ్మాయి.

"ఎవరండీ ఈ అమ్మాయి. నేనెప్పుడూ చూడలేదే" అని ప్రశ్నించాడు.

"నా మేడకోడలు ప్రతిమ అండీ. నిన్ననే వచ్చింది. ఇక్కడ హైస్కూల్లో చేర్పించ బోతున్నాను. ఇక మా ఇంట్లోనే ఉంటుంది." అంటూ ప్రతిమ తల్లిదండ్రుల బీదరికాన్ని, ఏ పరిస్థితుల్లో తను ఆమెను తీసుకురావల్సి వచ్చిందీ, అంతా వివరించి చెప్పాడు రామారావు.

రామారావు, ఆనందరావు వద్ద సెలవు తీసుకొని ప్రతిమతో వెళ్ళిపోయాడు. ప్రతిమ వెళ్తూ వెళ్తూ ఆనందరావు వైపు చూసి చిరునవ్వు నవ్వింది.

ఆ నవ్వుకు సంతానంలేని ఆనందరావు ఎడారి లాంటి జీవితంలో తొలకరి జల్లు కురిసినట్లయింది. మనసంతా ఆనందంతో నిండిపోయింది.

ఆఫీసులో కూర్చున్న ఆనందరావు ముందు ఫైళ్ళున్నాయన్న మాటేగాని, ఒక్క అక్షరమూ వ్రాయలేకపోయాడు. అతని కళ్ళముందు పదేపదే నవ్వుతున్న ప్రతిమ ముఖమే కనిపిస్తోంది. ఆ పిల్ల తప్పిపోయిన తన సంతానంలా అనిపిస్తోంది.

ఆరోజు ఎప్పటిలాగే బిజీగా ఉండేఆఫీసు లోంచి బయటపడేసరికి రాత్రి తొమ్మిది గంటల యింది. ఇల్లు చేరింది మొదలు ప్రతిమను మరొక సారి చూడాలనే తహతహ ఎక్కువయింది. కాని ఆసమయంలో ఆ ఇంటికి వెళ్ళలేక పోయాడు.

స్నానం చేసి భోజనానికి కూర్చున్నాడు ఆనందరావు.

" ఎదురింటి రామారావు అన్నయ్య వాళ్ళింటికి ఆయన మేనకోడలు వచ్చిందండీ. పేరు ప్రతిమ. ఆ అమ్మాయి ఎంత అందంగా ఉందండీ." అంటూ నిర్మల అంతటితో ఆగక ప్రతిమ ముద్దు ముఖం గురించీ, గుణగణాలను గురించీ వర్ణించి వర్ణించి మరీ చెప్పింది. దాంతో ఆనందరావు ప్రతిమను మళ్ళీ చూడాలన్న కోరిక బలమయింది. అయినా నిగ్రహించుకున్నాడు.

కన్నబిడ్డ సద్గుణాలను బర్త దగ్గర పదే పదే మెచ్చుకొనే తల్లిలా ప్రతిమను పొగుడుతున్న నిర్మల ఉన్నట్లుండి ఆగిపోయింది.

"చంద్రుడిలో మచ్చ అన్నట్లు, పాపం ప్రతిమకు..." ఆగింది నిర్మల.

"పాపం ఏమిటి? ఆ అమ్మాయికి ఏమయింది?" కంగారుగా అడిగాడు ఆనందరావు.

కన్నీళ్లు పెట్టుకొని అసలు విషయం చెప్పింది నిర్మల.

ప్రతిమకు చెముడని భార్య ద్వారా విన్న ఆనందరావుకు, చెప్పలేని దుఃఖం ముంచుకొచ్చింది. అంతవరకూ ప్రతిమ మీదున్న ప్రేమ, అభిమానం, ఆకర్షణ ఒకటికి రెండింతలయ్యాయి. తింటున్నఅన్నం సహించక చేయి కడుక్కుని లేచాడు.

ఆరాత్రి ఒక అందమైన కలవచ్చింది ఆనందరావుకి. ఆనందరావు ఒక గులాబీ తోటలోకి వెళ్ళాడు. గులాబీ తోటలో అన్నీ తెల్ల గులాబీలే. తోట మధ్యలో ఒక గులాబీ చెట్టుకి ఒకటే గులాబీ పూవు. అది అన్నింటిలోకి విభిన్నంగా ఎర్రగా

ఉంది. 'అది సూర్యోదయం కావటంతో మంచు బిందువులతో శుభ్రపడి స్వచ్ఛంగా మెరుస్తూ 'రా...రమ్మన్నట్లు' గాలికి తలఊపుతూ పిలుస్తోంది.

ఆనందరావు ఆ పూవుకు ఎదురుగా చేతులు కట్టుకునిలబడి దాని అందాన్ని కళ్లతో స్పరిస్తూ, ఆకలి, దాహం మరచి అలాగే నిలబడి పోయాడు. రోజులూ, నెలలూ, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. తోటలోని అన్ని పూవులూ ఎండి, రాలిపోయి కొత్తవిపూస్తున్నా, అది అలాగే నిత్యనూతనంగా ఉండిపోయింది. ఆనందరావు కూడా ఆ సౌందర్యారాధనలో క్రమేణా వయసు ముదిరి ముసలివాడై కృశించి వంగిపోయాడు. చివరకు ఒక రోజు చెట్టు మొదట్లో కూలి చనిపోయాడు. అప్పుడు గులాబీ పువు రాలి అతని గుండెలమీద పడింది. ఆ పూవులో ప్రతిమ ముఖం కనిపిస్తూఉంది.

"వద్దు... వద్దు..."అని అరుస్తూ నిద్రలోంచి లేచికూర్చున్నాడు ఆనందరావు. అతని మనసంతా చికాకుగా ఉంది.

'ఎప్పుడూ నిత్యనూతనంగా ఉండే పూవు రాలిపోయింది. అలా ప్రతిమ కూడా తనకు దక్కకుండా పోతుందా, ఇక ఎప్పుడూ ప్రతిమ తనకు కనిపించదా' విలవిలలాడి పోయాడు ఆనందరావు.

కంగారుపడుతున్న బార్యకు కల యావత్తూ చెప్పి, ప్రతిమను జాగ్రత్తగా చూడమని, రోజూ ఇంటికి పిలిచి యోగక్షేమాలు విచారించి తినేందుకు ఏవైనా పెడుతూ లాలిస్తూండమని చెప్పాడు.

ఆనందరావు మరుసటి రోజు నిద్ర లేవగానే వరండాలోకి వచ్చి ప్రతిమ కోసం చాలాసేపు చూసాడు, కాని ప్రతిమ కనిపించలేదు. త్వరత్వరగా స్నానం చేసి కాఫీ త్రాగుతూ వరండాలో కూర్చున్నాడు. ఒకవైపు అతని కళ్ళు పేపర్‌లోని వార్తల్ని చూస్తున్నా, రెండో వైపు ప్రతిమ కోసం వెతుకుతూనే ఉన్నాయి.

ఆఫీసుకు వెళ్ళిన ఆనందరావుకు అనుకోకుండా హైదరాబాదు ప్రయాణం పడింది. ఇంటికి వచ్చి "ఇక రెండు గంటల్లో ట్రెయిన్ ఉంది. దాంట్లో వెల్తాను. ప్రతిమ స్కూలుకు వెళ్ళిందా" అడిగాడు ఆతృతగా. నవ్వుకొంది నిర్మల. " మీరు నాకంటే ఎక్కువ ఇదయిపోతున్నారు " అంది.

"లేదు నిర్మలా. ఎందుకో ప్రతిమను చూసినప్పటినుంచి నాకు తెలియకుండా మమకారం పొంగుకొస్తూ ఉంది. ప్రతిమను చూడాలని ఉదయం నుంచీ ఎంత తహతహలాడుతున్నాననుకున్నావు."

"అయ్యో! ప్రతిమ మీరటు వెళ్ళగానే ఇటు మనింటికి వచ్చిందండీ. ఇప్పటివరకూ నా వెనుకనే తిరుగుతూ తెలియని లెక్కలు అవీ చెప్పించుకుంది. మీరొచ్చే ముందుగానే స్కూలుకు వెళ్ళింది."

"అరరె" అంటూ బాధపడిపోయాడు ఆనందరావు.

ఆరోజే ఆనందరావు హైదరాబాదు వెళ్ళిపోయాడు.

హైదరాబాదులో వారం రోజులు అనుకున్నపని పూర్తయ్యేసరికి పదిరోజులు పట్టింది. ఆ రోజురాత్రి ఎనిమిది గంటలకు ఇల్లు చేరాడు ఆనందరావు.

స్నానం చేస్తూ ప్రతిమ మాట ఎత్తాడు.

"నిర్మలా ఇప్పుడు రాత్రి ఎనిమిదే కదా. ఒక్కసారి వెళ్ళి తీసుకొస్తావూ. చూడాలని ఉంది."

"ఇంత రాత్రి పూట ఏమని చెప్పి ఆ అమ్మాయిని పిల్చుకొచ్చేదండీ. మీరే వెళ్లి చూసిరండి."

"ఎప్పుడూ లేంది ఏమని వెళ్లను. వాళ్లతో పెద్దగా చనువులేదు కూడాను."

"సరే, రేపు ఉదయం చూద్దురులెండి." అంది నిర్మల.

కాని, ఆనందరావు హైదరాబాదు నుంచి తెచ్చిన కాగాతాలతో ఉదయాన్నే ఆఫీసుకు వెళ్ళిపోవలసి వచ్చింది. అతను ఆఫీసుకు వెళ్ళి తను తెచ్చిన కాగితాలు ఆఫీసరుకిచ్చి మాట్లడుతుండేసరికి ఆడిట్ స్టాపు వచ్చారు.

దాంతో ఆనందరావు ఆడిట్ వాళ్ళ వ్యవహారాలు, వాళ్ల బాగోగులు, వాళ్ళు అడిగిన రిజిష్టర్లు ఇవ్వడం, ఇలా పదిరోజులు జరిగిపోయాయి. ఈ పదిరోజులు ప్రతిమను చూడడం పడలేదు. తరువాత ఆఫీసు ఇన్‌స్పెక్షన్ ఇంకో పదిరోజులు. రోజూ ఉదయం ఏడుగంటలకు వెళితే రాత్రి పది గంటలకే తిరిగి రావడం. అయినా అతని మస్కిష్కంలో ప్రతిమ రూపం మాసిపోలేదు. రోజూ ఇంటికి రాగానే భార్యను ప్రతిమ గురించి అడిగేవాడు. 'ప్రతిమ ప్రతిరోజూ తీరిక సమయాల్లో మనింట్లోనే ఉంటుందండీ' అని భార్య సమాధానమిచ్చేది. దాంతో చూడలేకపోయానే అని బాధపడేవాడు ఆనందరావు.




ఆనందరావు ప్రతిమ మీద అభిమానం ఇంతింతై నటుడంతైనట్లు విపరీతంగా పెరిగిపోయింది. చివరకు భార్యాభర్తలు ఒక నిర్ణయానికి వచ్చి పదిమంది పిల్లల్లో ఒకటయిన ప్రతిమను ఆమె తల్లిదండ్రుల నడిగి తాము .దత్తత తీసుకోవాలనుకున్నారు.

అర్జంటు పనులన్నీ అయి రోటీన్‌లోకి వచ్చిపడేసరికి నెలరోజులయింది. ఈ నెలరోజులు అతనికి ప్రతిమను చూడటం పడలేదు. ఎంత విచిత్రం. మొదటి రోజు చూడ్డం తప్ప ఈరోజు వరకూ చూడలేకపోయినా ఆరోజు చూసిన రూపం ఇప్పటికీ అతని కళ్ళముందు కదలాడుతోంది. ఇలా తన మనస్సులో నిలబడిపోయిన ఆమె రూపాన్ని ఎంతో ఇదిగా మెచ్చుకొంటుంటాడు.

ఇంతకాలం పనిలో అలసిపోవడంతో రెండు రోజులు ఆఫీసుకు సెలవు పడేసి ఇంట్లోనే ఉండిపోయాడు. తొమ్మిది గంటలకు ప్రతిమ స్కూలుకు వెలుతందని భార్య చెప్పటంతో ఆరోజు ఉదయం త్వరత్వరగా పనులు పూర్తి చేసుకొని ఎనిమిదిన్నరకల్లా వరండాలో కూర్చున్నాడు. తన భార్యకు రోజూ ప్రతిమను చూసే అవకాశమున్నందువల్ల తన బాధ ఆమెకు హాస్యాస్పదంగా అనిపించవచ్చుననుకున్నాడు.

తదేకంగా అటే చూస్తున్న ఆనందరావుకి సరిగ్గా తొమ్మిది గంటల సమయంలో రామారావు ఒక్కడే ఇంట్లోంచి రావడం కనిపించింది.

ఆనందరావు ఉండబట్టలేక, లేచి వీధిలోకి వెళ్ళి రామారావుని పలుకరించాడు.

" ఏమండీ. మీ అమ్మాయి ప్రతిమ ఏది, స్కూలుకు వెళ్ళడం లేదా? " అన్నాడు మాటలు తడబడుతుండగా.

" లేదండీ. స్కూలుకు సెలవలు కదా. రాత్రి వాళ్ళ నాన్న వచ్చాడు. ఈ రోజు ఉదయం ఏడు గంటల బస్సుకు వాళ్ళ ఊరు తీసుకువెళ్ళాడు. వారం రోజుల్లో తిరిగి వస్తుంది. పాపం వాళ్ళు జరుగుబాటుకు చాలా అవస్తపడుతున్నారండీ. " ఆ మాటంటూంటే ఆయన కళ్లలో నీరు తిరగడం గమనించాడు ఆనందరావు.

ఆనందరావు లోని ఆతృతను, ఆవేదనను అర్థం చేసుకొనే స్థితిలో లేడు రామారావు. గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. ప్రతిమ కుటుంబ పరిస్థితికి ఆనందరావు కూడా చాలా బాధ పడ్డాడు.

★ ★ ★

రామారావు అటు వెళ్ళగానే ఇటు ఇంట్లోకి అడుగుపెట్టిన ఆనందరావు భార్యను పిలిచాడు.

"ఏమిటండీ" అంటూ వచ్చింది నిర్మల.

"నిర్మలా నేనిక ప్రతిమను వదిలి ఉండలేను.

నా గుండెల్లో ఆ అమ్మాయి రూపం ముద్రించుకు పోయింది. మనం ప్రతిమను దత్తతతీసుకోవాలి."

"నాకు అలాగే ఉందండీ. ఆ పిల్ల నట్టింట్లో తిరుగుతూ ఉంటే మహాలక్ష్మి వచ్చినట్లుంటుంది. ఎంత కళ, ఏం తేజస్సు."

"అయితే నువ్వు ఒప్పుకున్నట్లేనా?"

"ఒప్పుకోక పోవడమేమిటండీ. మనం చాలా రోజులనుంచి అనుకుంటున్నదేగా."

"అనుకునేది వేరు, వాస్తవం వేరు. ప్రతిమ ఈరోజే ఊరికి వెళ్ళిందట. మళ్ళీ ఇంకో వారం రోజులకు గాని రాదు. ఆమె ఎలాగూ తన తండ్రితో వస్తుంది. ఆరోజే సెటిల్‌చేసుకుందాం. "

"అలాగే" తృప్తిగా అంది నిర్మల.

ఇది జరిగిన రెండు రోజులకు అక్కను చూడ్డనికి వచ్చిన వేణు వీళ్ల నిర్ణయం విని, తెల్ల బోయాడు. ప్రక్కనే బావ ఉండడంతో ఏమీ మాట్లాడలేక మౌనంగా ఉండిపోయాడు. అతని ఉద్దేశం వీళ్లకు వారసులు లేకపోతే వాళ్ళ ఆస్తంతా తమకే చెందుతుందని ఇంతకాలం భావించాడు. కాని వీళ్ల నిర్ణయం తెలిసి అతని గుండె బేజారయి పోయింది. బావను ఆఫీసుకు వెళ్లనిచ్చి, అక్క మీద విరుచుకుపడ్డాడు.

"ఏం అక్కా! మేము మీకు పరాయి వాళ్లమయి పోయామా. నాకు పిల్లల్లేరా? వాళ్ళలో ఎవర్నో ఒకర్ని దత్తత తీసుకోవచ్చుగా. మేం కాదంటామా? రక్త సంబంధం కాదని ఎవరో దారినబోయే పిల్లను తెచ్చి సాక్కోవడంలో మీ ఉద్దేశం"

నిర్మల చిన్నగా నవ్వి, "ప్రతిమ చెవిటి పిల్ల. తల్లిదండ్రులకు ఆ పిల్ల భారం. అలాంటి పిల్లను దత్తత చేసుకుంటేనే కదరా పుణ్యందక్కేది. "అంది.

"అక్కా! తమ్ముడనే బంధం కూడా లేకుండా నన్నెంతో నిర్లక్ష్యం చేసావు." అంటూ అలిగి భీష్మిం చుకొనికూర్చున్నాడు.మంచినీళ్ళుకూడా త్రాగలేదు.

నిర్మలకు కడుపులో దేవినట్లయింది. ఆమెకు తమ్ముడితో చిన్ననాటి జీవితమంతా తీయని కలలా గుర్తుకొచ్చింది.

"అట్లాగేలేరా తమ్ముడూ. మీ బావతో నిదా నంగా చెప్పి చూస్తాను. మాలో మేము అనుకున్నా మేగాని యింకా ప్రతిమ తల్లిదండ్రుల దగ్గర ఈ విషయం ఎత్తలేదు." అంది నెమ్మదిగా.

దాంతో వేణు ముఖం నిర్మలంగా మారింది.

"అదేనక్కా! నేను చెప్పేది. బావ అయితే పరాయివాడనుకో. నువెట్లా ఒప్పుకొన్నావనేది అర్థం కాని విషయం." అంటూ ఏవేవో మాట్లాడుతూ భోంచేసాడు.

ఆ సాయంత్రం తేలిక బడ్డ మనస్సుతో తన ఊరికి వెళ్ళిపోయాడు. నిర్మల కూడా మనసు నిగ్రహపరుచుకుంది.

రోజులు గడుస్తున్నాయి. ఆ మరుసటిరోజే ప్రతిమ వస్తుంది. ఆ రాత్రి విషయం లేవదీసాడు ఆనందరావు.

" రేపు ఉదయం ప్రతిమ రాబోతోంది. ఇద్దరం వెళ్ళి ఆమె తండ్రితో మాట్లాడి దత్తత తీసుకుందాం. రేపు బాగుంది కూడాను. " అన్నాడు ఆనందంగా.

"తొందరపడి ప్రతిమ తల్లిదండ్రులతో మాట్లాడకండి. కొంతకాలం తరువాత ఏదయినా నిర్ణయం తీసుకుందాం."

నిర్మల అలా అనేసరికి ఆనందరావుకు వెంటనే నోట మాట రాలేదు.

"అంటే నీ ఉద్దేశం" అన్నాడు చివరకు.

"నా తమ్ముడికీ పిల్లలున్నారండీ ! వాళ్ళంటే మీకు చాలా ఇష్టం. వాళ్ళలో ఒకర్ని దత్తత తీసు కుందాం. ప్రతిమ ఎవరో పరాయిపిల్ల." అదే తన నిర్ణయమన్నట్లుగా చెప్పింది నిర్మల.

ఉరకలు వేస్తున్న అతని ఉత్సాహం చల్లారి పోయింది. ప్రతిమను తన బిడ్డగా పదిమందికి చెప్పుకొని ఎంతో గారాబంగా పెంచాలనుకున్నాడు. ఖరీదైన వైద్యం చేయించి ఆమె చెముడు పోగొట్టాలనుకున్నాడు. ప్రతిమ పరాయిపిల్లే అయినా తనకు గత జన్మలో బిడ్డలా అనిపిస్తోంది. కాని, ఇప్పటి నిర్మల ప్రవర్తన అతన్ని మూగవాణ్ణి చేసింది. తన కలలు కల్లలు అయ్యేసరికి అతని కళ్ళలోంచి వెచ్చగా కన్నీరు ఉబికాయి.

★ ★ ★

ఆరోజు ఉదయం మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు కొనుక్కొని వస్తూ ఉంది నిర్మల. ఊరి మధ్యలో రైల్వే లైను. ఆమె తన ఇంటికి వెళ్లా లంటే రైల్వే లైను దాటాలి. ఏదో రైలు వస్తుంది కాబోలు గేటు వేసి ఉంది. నిర్మల గేటుకు ఇవతలగా మిగతా వాళ్లతో బాటు నిలబడింది.

ఇంతలో దూరంగా అవతలివైపున రోడ్డుమీద వస్తూ కనిపించింది ప్రతిమ. మాయని చిరునవ్వుతో ప్రతిమను దత్తత చేసుకొనే విషయం విరమించు కొన్నప్పటినుండీ నిర్మల కొద్ది కొద్దిగా ప్రతిమతో సంబంధాలు తగ్గించుకొంటూ వస్తూంది.

మూసి ఉన్న గేటు ప్రక్కనే మనిషి వెళ్ళే దారి మాత్రం ఉన్నది. అందులోంచి రాసాగింది ప్రతిమ. ఎవరూ ఆమెను గమనించలేదు. ఆ వైపు చూసిన నిర్మల ఉలిక్కిపడింది. అంతే, ఆమె గుండె జల దరించింది. దూరంగా తుపాకీ గుండులా వస్తోంది తమిళనాడు ఎక్స్‌ప్రెస్. ఎలక్ట్రిక్ ఇంజన్ కావడంతో




శబ్దం అంతగా లేదు. లైనుకు అటూ ఇటూ పదడు గుల ఎత్తున దుమ్ము రేపుకుంటూ వస్తోంది.

ప్రతిమ మొదటి లైను మీద అడుగువేసింది. నిర్మల నోట్లోంచి మాట రావడం లేదు. ఎంత ప్రయత్నించినా. గేటుకు రెండు వైపులా నిలబడి ఉన్నజనం, "అమ్మాయ్ బండి... బండి వస్తోంది. " అంటూ కేకలు వేయసాగారు.

ఆ కేకలు గాలిలో కలసిపోయాయి తప్ప, ప్రతిమకు వినిపించలేదు.

ప్రతిమకు వెనుకకు తిరిగి చూడకుండా పుస్తకాలు గుండెకు ఆనించి పట్టుకొని మొదటి లైను దాటింది తల వంచుకొని. ఆమెకు చెముడన్న సంగతి ప్రక్కవాళ్ళకు చెప్పి వెర్రి కేకలు పెట్ట సాగింది నిర్మల. అవేమో ప్రతిమకు వినిపించలేదు. అప్పటికే ఆమె రెండవ లైనును సమీపిస్తోంది. దానిమీదే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ దడదడమని శబ్దం చేసుకుంటూ పరుగెత్తుకు వస్తోంది.

రైల్వే లైను దాటడానికి రెండవ లైను మీద కాల ేసింది. గేటుకు అటూఇటూ ఉన్న జనం హో... హో... కారాలు చేసారు తప్ప ఎవరికీ ముందుకు రావడానికి ధైర్యం చాల్లేదు.

అంతే... నిమిషంలో వెళ్ళిపోయింది ట్రైను అదే పట్టాలమీద. కళ్ళప్పగించి చూస్తున్న నిర్మలకు తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రెండు ఫర్లాంగులు దాటి పోయినా రైలు పట్టాలు దాటుతున్న ప్రతిమ ఎక్కడా కనిపించలేదు. అయితే బండి వేగానికి సుడులు తిరిగే గాలిలో, పుస్తకాలలోని కాగితాలు గాలిపటాల్లా ఎగరసాగాయి.

గాలిలో ఎగిరే కాగితాల్లోంచి ఒకకాగితం ఎగిరి వచ్చి నిర్మల కాలికిచుట్టుకొని ఆగిపోయింది. మసక బారిన కళ్ళతో ఆ కాగితం వైపు చూసింది. అందులో కె.ప్రతిమ, ఆరవతరగతి అనివ్రాసి ఉంది. నిర్మల కళ్ళలోంచి కన్నీరువరదలై పారాయి. ట్రైను కిలోమీటరు దూరం వెళ్ళిపోయింది. అంటే ప్రతిమ శరీరం సూక్ష్మఖండాలుగా మారి మట్టిలో కలసి పోయిందన్నమాట.

పిచ్చిగా అరచి కూలబడిపోయింది నిర్మల.

★ ★ ★

"నిర్మలా... నిర్మలా... ఏమయింది నీకు" అంటూ భుజాల్ని కుదుపుతున్న భర్త చేతుల్లో కళ్లు తెరిచింది. ఆమె కళ్లల్లోంచి ఆగని కన్నీరు.

ఎంత భయంకరమైన కల. ప్రతిమ మరణం తను తట్టుకోలేదు. తమది జన్మజన్మల బంధమని మనసు పదేపదే చెబుతోంది.

భర్త ఆనందరావు చేతిని తన చేతుల్లోకి తీసుకొని, "ఏమండీ నా తమ్ముడి బిడ్డను దత్తత తీసుకున్నంత మాత్రాన ప్రతిమను దత్తత తీసుకో కూడదనేం లేదుగా. ప్రతిమను కూడా దత్తత తీసుకుందామండీ. తొలి వెలుగురేఖలాంటి ప్రతిమ నవ్వంటే నాకెంతో ఇష్టం. నాకు ఆ నవ్వే కావాలి." అంది ఏడుస్తూ.

ఆనందరావు ఆమె తల నిమురుతూ "అలాగే" అన్నాడు తృప్తిగా. ❀